విజ్ఞాన నిలయం గ్రంథాలయం

- జూన్ 7 వరకు గ్రంథాలయాల్లో ప్రత్యేక వేసవి శిక్షణ శిబిరాలు
- 15 ఏళ్ల లోపు చిన్నారులకు అవకాశం



అంబాజీపేట శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్, జనరల్ నాలెడ్జ్ వివరిస్తున్న గ్రంథాలయాధికారి

అంబాజీపేట: గ్రంథాలయం ఒక విజ్ఞాన నిలయం. తెలియని విషయాన్ని తెలుపుతుంది. అగ్రగామిగా నిలపుతుంది. మౌనాన్ని పోగొడుతుంది. అనర్గళంగా మాట్లాడిస్తుంది. అందుకే పుస్తకం.. ఓ మంచి నేస్తం. పుస్తక పఠనం అలవర్చుకుంటే కొత్త విషయాలపై పట్టు సాధించవచ్చు. ప్రస్తుత కాలంలో సెల్‌ఫోన్‌లు, టీవీలకు అతుక్కుపోతూ సంప్రదాయ విలువలకు దూరంగా వెళ్లిపోతున్నారు. నిత్యం సెల్‌ఫోన్‌లతో బిజీగా గడిపే విద్యార్థులను గ్రంథాలయాలను పరిచయం వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రవేశపెట్టారు. వచ్చే నెల జూన్ 7 వరకు విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించడానికి ఆయా శాఖ గ్రంథాలయాల్లో అన్ని ఏర్పాట్లు చేశారు. దీనికి వేదికగా చేసుకుని పాఠకుల సంఖ్య, సభ్యత్వాలను పెంచడానికి కొత్తపేట డివిజన్‌లో ఉన్న 11 మండలాల గ్రంథాలయ సిబ్బంది కృషి చేస్తున్నారు. అంబాజీపేట, ముమ్మిడివరం, రాజోలు, కొత్తపేట, ఆలమూరు గ్రేడ్-2లోను, అంతర్వేదిపాలెం, సఖినేటిపల్లి, మల్కిపురం, మానేపల్లి, అత్రేయపురం, అంగర, రాయవరం, పి.గన్నవరం, అయినవిల్లి, మానేపల్లి, గోపాలపురం గ్రేడ్-3లోను, మామిడికుదురు, రావులపాలెం, నరేంద్రపురం, కేశనపల్లి, కందికుప్ప, కొమరిపాలెం గ్రేడ్-4లోను శాఖా గ్రంథాలయాలు ఉన్నాయి.

అందుబాటులో వంద రకాల పుస్తకాలు..

గ్రంథాయాల్లో పాఠకుని అభిరుచికి తగినట్లుగా వందల రకాల అంశాలకు సంబంధించి పుస్తకాలు ఉన్నాయి. రామాయణం, భారతం, భాగవతం వంటి పురాణ ఇతిహాసాలు, డిటెక్టివ్ నవలలు, కథలు, బాల సాహిత్యం, ప్రముఖుల జీవిత చరిత్రలు, జంతు, వృక్ష, రసాయన, భౌతిక, చరిత్ర మనో విజ్ఞాన శాస్త్రాలు, పోటీ పరీక్షలకు సంబంధించిన ఏపీపీఎస్సీ, టీఎస్ఆర్‌బీ, ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ పుస్తకాలు, గణిత, గణాంక, సామాజిక, ఆర్థిక శాస్త్ర పుస్తకాలు, దిన, వార, మాస, పత్రికలు అందుబాటులో ఉంటాయి. విద్యార్థులకు క్విజ్‌పోటీలు, వ్యాసరచన, వక్తృత్వం పోటీలు, రంగవల్లులు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించడానికి సిద్ధం చేశారు. వీటిలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించనున్నారు.

శిక్షణ శిబిరంలో ఏమేం నేర్పిస్తారంటే...

ఉదయం 8 నుంచి 8.30 వరకు కథ వినడం, 8.30 నుంచి 9.30 వరకు ఆటలు వంటి శారీరక కార్యకలాపాలు, 9.30-9.40 వరకు విరామం. 9.40-10 వరకు పుస్తక సమీక్ష, 10-10.30 వరకు గ్రంథాలయంలో ఉండే పుస్తకాలు చదవడం, కథలు చెప్పడం. 10.30-11.30 వరకు స్పోకెన్ ఇంగ్లీష్/డ్రాయింగ్/పెయింటింగ్/పేపర్‌క్రాఫ్ట్/మ్యూజిక్ నేర్పిస్తారు. పదిహేనేళ్లలోపు చిన్నారులు వేసవి సెలవుల్లో గ్రంథాయాలను సందర్శించి, పుస్తక పఠనంతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు దోహదపడతాయి. శిబిరాలకు హాజరైన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తారు.

విద్యార్థులకు ఎంతో మేలు



వేసవి విజ్ఞాన కేంద్రాలు ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుంది. గ్రంథాలయానికి వచ్చేలా విద్యార్థుల్లో చైతన్యం నింపుతున్నాం. వారికి నచ్చే కథల పుస్తకాలు, డ్రాయింగ్ తదితర వాటికి ఆకర్షితులై రోజు సుమారు 150 మంది విద్యార్థుల వరకు వస్తున్నారు. ఎక్కువగా కథలు, చరిత్ర పుస్తకాలను చదవడంతో పాటు ముఖ్యమైన సమాచారాన్ని నోట్ చేసుకుంటున్నారు.

– జి.శ్రీనివాస్, రికార్డు అసిస్టెంట్, శాఖా గ్రంథాలయం, అంబాజీపేట

సబ్ జైలు ఆకస్మిక తనిఖీ



కొత్తపేట సబ్‌జైలులో ఖైదీల సౌకర్యాలపై ఆరా తీస్తున్న సీనియర్ సివిల్ జడ్జి రమణారెడ్డి


కొత్తపేట: స్థానిక సబ్‌జైలును సీనియర్ సివిల్ జడ్జి పి.రమణారెడ్డి శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్‌జైలులో రిమాండ్ ఖైదీల సౌకర్యాలు, వసతి, భోజన సౌకర్యాలు గురించి సబ్‌జైలు అధికారులు, సిబ్బందిని ఆరా తీసి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఖైదీలతో ముఖాముఖి మాట్లాడారు. వారిపై మోపబడిన నేరాలు, కేసులు, రిమాండ్ కాలం తదితర అంశాల గురించి ఆరా తీశారు. అవసరమైతే ఉచిత న్యాయ సహాయం సౌకర్యం కల్పిస్తామని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్షణికావేశంలో చేసిన తప్పులకు ఈ పరిస్థితి ఏర్పడి ఉండవచ్చని, ఇకపై సత్ప్రవర్తనతో మెలిగి భవిష్యత్‌లో మంచి జీవితాన్ని గడపాలని సూచించారు.

భక్తులతో పోటెత్తిన వేంకటేశ్వరుని ఆలయం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామిదర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారు జామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితుల స్వామికి తులసీ పూజలు చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామివారికి పటిక బెల్లం మొక్కుగా చెల్లించారు.

క్లుప్తంగా

కన్నుల పండువగా వెంకన్న కల్యాణం



అంబాజీపేటలో వేంకటేశ్వర స్వామికి కల్యాణం నిర్వహించిన భక్తులు

అంబాజీపేట: శ్రీనివాసా గోవిందా... శ్రీ వేంకటేశా గోవిందాలతో నామస్మరణాల మధ్య వెంకన్న కల్యాణం కన్నుల పండువగా జరిగింది. కొర్లపాటివారిపాలెంలో వేంచేసియున్న శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి కల్యాణం శనివారం రాత్రి కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పాణింగపల్లి నరసింహాచార్యులు బ్రహ్మత్వంలో స్వామి వారి కల్యాణం, వేద మంత్రోచ్చారణ నడుమ, మంగళ వాయిద్యాలతో, గోవింద నామస్మరణతో వెంకన్న కల్యాణం కన్నుల వైకుంఠంగా సాగింది. వందలాది మంది మహిళలు స్వామి కళ్యాణాన్ని భక్తి శ్రద్ధలతో తిలకించారు. అంతకుముందు స్వామివారి ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రాంగణం వద్ద ఆదివారం స్వామి వారి తీర్థం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు వీరేశ్వరస్వామికి..

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారంలో వేంచేసియున్న ఉమాపార్వతి సమేత వీరేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి సమేత కేశవస్వామి వార్ల కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు దేవాలయ అర్చకులు చంద్రమౌళి వెంకట నరిసింహశర్మ, సుదర్శనం కేశవాచార్యులు, భక్త బృందం తెలిపారు. స్వామి వార్ల కల్యాణ మహోత్సవాల్లో భాగంగా త్రిశూల చక్రస్నానం, నాగవల్లి, వైశాఖ పూజలు చేయనున్నామన్నారు. అదే రోజున ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్నసమారాధన చేపట్టనున్నామన్నారు.

నేడు రంగనాయక స్వామి కల్యాణోత్సవం



శ్రీ, భూ సమేత రంగనాయక స్వామి

అయినవిల్లి: మండలంలోని వీరవల్లిపాలెంలో కొలువైన శ్రీ, భూ సమేత రంగనాయక స్వామికి ఆదివారం కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ శనివారం ఓ ప్రకటనలో ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. స్వామి వారికి వైశాఖ శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకూ స్వామికి విశేష పూజలు నిర్వహిస్తారని తెలిపారు. మధ్యాహ్నం స్వామిని ప్రత్యేక రథంపై గ్రామోత్సవం నిర్వహిస్తారన్నారు. సాయంత్రం తొమ్మిది గంటలకు స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తామన్నారు.

వేసవి శిక్షణలో చిన్నారుల ప్రతిభ



బహుమతి అందుకుంటున్న జాన్‌విక్టర్

మలికిపురం: లక్కవరంలోని ఓ పాఠశాలలో నిర్వహించిన ఉచిత సమ్మర్ శిక్షణలో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మే 1వ తేదీ నుంచి 18వ తేదీ వరకూ ఈ శిక్షణ నిర్వహించారు. డ్రాయింగ్, కంప్యూటర్ విద్య, స్పోకెన్ ఇంగ్లీష్, వేదిక్ మ్యాథ్స్, క్లాసిక్ డ్యాన్స్ ఇలా పలు అంశాలలో నిర్వహించిన పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. డ్రాయింగ్‌లో జి.సుష్మ, స్పోకెన్ ఇంగ్లీష్‌లో కె.జాన్‌విక్టర్, కంప్యూటర్‌లో ఎ.అవినాష్ విజేతలుగా నిలిచారు. బహుమతుల పంపిణీలో గోడి బాలాజీ, ఉపాధ్యాయులు నారాయణ, రామకృష్ణ, ప్రతాప్, సూర్యకళ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శత జన్మదిన వేడుకలు



రత్నం పుట్టినరోజు వేడుకల్లో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

సఖినేటిపల్లి: వందేళ్లు పూర్తి చేసుకున్న తండ్రికి పుట్టినరోజు వేడుకలను కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. సఖినేటిపల్లి సంజీవయ్య కాలనీకి చెందిన దొండపాటి రత్నం 100 సంవత్సరాల పూర్తి చేసుకున్న సందర్భంగా శత జయంతి వేడుకలను గ్రామస్తులు కుటుంబ సభ్యులు బంధుమిత్రుల మధ్య శనివారం ఘనంగా నిర్వహించి విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో లూథరన్ హైస్కూల్ కరస్పాండెంట్ నల్లి ప్రేమానందం, సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, గొల్లమందల విజయరత్నం, రమేష్ బాబు, కుసుమ రాకేష్, కుటుంబ సభ్యులు సువర్ణ రత్నం, మేరీ సుజాత, రత్నకుమారి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఉపాధితో అభివృద్ధి పనులు



ఉపాధి హామీ పథకంలో చేపట్టిన కొమరాడ-మగటపల్లి పంట కాలువ పూడికతీత పనులు

- రూ.4.30 కోట్లతో నిర్వహణ
- 426 పనుల గుర్తింపు

మామిడికుదురు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మండల పరిధిలో 18 గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా వేసవిలో నిర్వహిస్తున్న పనుల్లో కూలీలు భారీగా పాల్గొంటున్నారు. పశువులకు తాగునీరు అందించే చెరువుల్లో పూడికతీత, కొబ్బరిచెట్ల చుట్టూ పళ్లాలు ఏర్పాటు, మట్టి రోడ్ల నిర్మాణం, పంట కాలువల్లో పూడికతీత తదితర పనులు ఉపాధి హామీ ద్వారా నిర్వహిస్తున్నారు. ముందుగా గ్రామ సభల ద్వారా పనులను గుర్తించి స్థానిక రైతులు, ప్రజా ప్రతినిధులు సూచించిన పనులను ఉపాధి హామీ ద్వారా నిర్వహిస్తున్నారు.

45 పనులు... 1495 కూలీలు

మండలంలోని 18 గ్రామాల్లో ప్రస్తుతం 45 పనులు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు 1400 మందికి పైగా కూలీలు పనుల్లో పాల్గొంటున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.4.30 కోట్ల విలువైన 426 పనులు చేపట్టాలని నిర్ణయించారు. వీటికి పాలనా పరమైన అనుమతి పొందారు. వీటిలో ఇంత వరకు 180 పనులను పూర్తి చేశారు. మిగిలిన పనులు యుద్ధ ప్రాతిపదికపై నిర్వహిస్తున్నారు. అనుమతి పొందిన పనుల్లో ఈ ఏడాది జూలై నెలాఖరుకు 80 శాతం పనులు పూర్తి చేస్తామని ఉపాధి హామీ పథకం ఏపీఓ ఆర్.రమేష్‌బాబు తెలిపారు. మిగిలిన 20 శాతం పనుల్ని మార్చి నెలాఖరుకు పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు.

ప్రజాదరణతో మళ్లీ విజయం సాధిస్తున్నాం

- వైఎస్సార్ సీపీ అభ్యర్థి జగ్గిరెడ్డి ధీమా
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు



కొత్తపేటలో వీరబ్రహ్మేంద్రస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: సంక్షేమ పథకాలు పొందిన ప్రజా విశ్వాసం, వారి ఆదరణ, అభిమానంతో నియోజకవర్గంలోనూ, రాష్ట్రంలోనూ ఘన విజయం సాధిస్తున్నామని స్థానిక సిట్టింగ్ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని వివిధ ఆలయాలను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దానిలో భాగంగా స్థానిక ఏనుగులమహల్‌లో వేంచేసిన శ్రీచక్ర మహామేరు (రాజరాజేశ్వరి) యంత్రాలయాన్ని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సతీ సమేతంగా దర్శించుకున్నారు. శ్రీచక్రానికి జగ్గిరెడ్డి - లావణ్య దంపతులతో ఆలయ ప్రధాన అర్చకుడు అయిలూరి సుబ్రహ్మణ్యశర్మ ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం కొత్తపేటలో గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామివారి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం, వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆరాధనోత్సవాల్లో జగ్గిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నిక పేదలకు, పెత్తందార్లకు మధ్య జరిగిన యుద్ధంగా అభివర్ణించారు. గత ఐదేళ్ల వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలపై ప్రజలు పూర్తి విశ్వాసం చాటుకున్నారన్నారు. పెత్తందారులు ఎందరు కలసినా పథకాలు పొందిన పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు మాత్రం వైఎస్సార్ సీపీ పక్షానే నిలిచారన్నారు. నియోజకవర్గంలో మంచి మెజార్టీతో మనం విజయం సాధించడంతో పాటు సీఎం జగన్ చెప్పినట్టు గత ఎన్నికల ఫలితాలను మించి స్థానాలతో ఘన విజయం సాధిస్తున్నామన్నారు. ఎన్నికల్లో పార్టీ విజయం కోసం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అవిశ్రాంతంగా కృషి చేశారని, వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ విజయోత్సవానికి అందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జగ్గిరెడ్డి వెంట అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి మట్టపర్తి సూర్యచంద్రరావు, పార్టీ యువజన విభాగం సభ్యులు బెజవాడ నారాయణరావు, బీసీ విభాగం సభ్యులు రాయుడు కృష్ణ, యాళ్ల బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కన్యకాపరమేశ్వరి జయంతి



కొత్తపేటలో 102 కలశాలతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న మహిళలు



అంబాజీపేటలో వాసవీ మాతకు కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

అంబాజీపేట: తొలి త్యాగశీలిగా పేరుగాంచిన ఆర్యవైశ్యుల ఇలవేల్పు వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి పురస్కరించుకుని అంబాజీపేట కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు చంద్రమౌళి సుబ్రహ్మణ్యశర్మ పర్యవేక్షణలో యలమంచిలి సుబ్రహ్మణ్యశర్మ బ్రహ్మత్వంలో మహిళలు భారీగా కుంకుమ పూజలు చేశారు. చంద్రమౌళి ధనుష్‌శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అలంకరణ చేశారు. అనంతరం భారీ అన్నసమారాధన చేపట్టారు.

ఆత్రేయపురంలో..

ఆత్రేయపురం: స్థానిక వల్లీ, దేవసేన సమేత సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శనివారం వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. వాసవి క్లబ్ ఎస్ఎస్ఎస్ విజయం ఆధ్వర్యంలో వాసవి మాతకు కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ ఎస్ఎస్ఎస్ జోన్ చైర్మన్ పేరూరి నాగేశ్వరరావు, అధ్యక్షుడు పట్నాల నాగరాజు, కార్యదర్శి వెచ్చా నాగ వెంకట సుబ్రహ్మణ్యం, కోశాధికారి యలమర్తి శ్రీనివాస్, శ్రీకాకుళపు సత్యనారాయణ, నాగబాబు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కొత్తపేట: ఆర్యవైశ్యుల ఇలవేల్పు వాసవీ కన్యకాపరమేశ్వరి భక్తులు జై వాసవీ మాత.. జైజై వాసవాంబయ నమః నామస్మరణతో శనివారం కొత్తపేట మార్మోగింది. తమ కులదేవతగా, పార్వతీదేవి అంశతో జన్మించి ఆత్మగౌరవం, త్యాగం వంటి విలువైన అంశాలు ప్రపంచానికి చాటిన కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలను కొత్తపేటలో వైభవంగా నిర్వహించారు. ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్-కోనసీమ, ఆర్యవైశ్య సంఘాల సమైఖ్య సహకారంతో ఉదయం నుంచి వివిధ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. పూర్వం అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపకులు శ్రీఘాకోళ్లపు భాస్కరరావు మనవళ్లు శ్రీఘాకోళ్లపు అనిల్, సునీల్ దంపతులచే ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసుల రామచంద్రశర్మ (రాంబాబు) ఆధ్వర్యంలో విశేష కుంకుమార్చన, వివిధ పూజలు నిర్వహించారు. అనంతరం 102 కలశాలతో వాసవీ మాత ఆలయం నుంచి గ్రామంలో వాసవీ మాత భక్తులు ముఖ్యంగా మహిళలు గ్రామోత్సవం నిర్వహించారు. తిరిగి ఆలయానికి చేరుకోగా 102 కలశాల ద్వాదశ పుష్కర జలంతో అమ్మవారికి అభిషేకం జరిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో 102 కలశాలతో సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్నం భారీ ఎత్తున అన్నసమారాధన జరిపారు. అత్యధిక సంఖ్యలో వాసవీమాత భక్తులు పాల్గొన్నారు.

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో జగన్మాత వాసవి కన్యకా పరమేశ్వరి జయంతిని వైభవంగా నిర్వహించారు. ఆలమూరులోని శ్రీ, భూ సమేత జనార్దనస్వామి ఆలయంలో తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేక రథంలో గ్రామోత్సవం నిర్వహించారు. ప్రముఖ వేద పండితులు కాళ్ళకూరి సూరిపండు ఆధ్వర్యంలో అమ్మవారికి వేద మంత్రోచ్చారణల మధ్య భక్తులు ప్రత్యేక కుంకుమ పూజలను శాస్త్రోక్తంగా జరిపించారు. అమ్మవారి పూజ సామగ్రిని గ్రామానికి చెందిన వెత్సా సూర్య గుప్తా ఉచితంగా పంపిణీ చేసి, అన్న సమారాధన నిర్వహించారు.

తాటమ్మ జాతర ప్రారంభం

పి.గన్నవరం: గ్రామ దేవత తాటమ్మ జాతర మహోత్సవాలు శనివారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని నిలబెట్టి ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం వరకూ ధూప సేవలు నిర్వహిస్తారు. 23న గ్రామోత్సవం జరుగుతుంది. 24 నుంచి ప్రతి రోజూ అమ్మవారికి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. వచ్చే నెల 4న అమ్మవారికి చిన్న జాగరం, 5న పెద్ద జాగరం, 6న అమ్మ వారి తీర్థ మహోత్సవం జరుగుతుంది.

నేడు గరుడేశ్వర స్వామి కల్యాణం

పి.గన్నవరం: గ్రామంలో వేంచేసిన బాలాత్రిపుర సుందరీ సమేత గరుడేశ్వర స్వామి వారి కల్యాణం ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఆలయ అర్చక స్వామి భైరవభొట్ల సత్యనారాయణ మూర్తి తెలిపారు. కల్యాణ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కోకో గింజలకు కనీస మద్దతు ధర ప్రకటించాలి

అంబాజీపేట: కోనసీమ వ్యాప్తంగా కొబ్బరి తోటల్లో అంతర పంటగా సాగుచేస్తున్న కోకో గింజలకు ఇతర పంటలకు ప్రభుత్వం ప్రకటిస్తున్న కనీస మద్దతు ధరను ప్రకటించాలని కోనసీమ కోకో రైతుల అసోసియేషన్ కోరింది. అంబాజీపేట సొసైటీ కార్యాలయం పై అంతస్తులో ఉన్న కృషీవల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ కార్యాలయంలో కోనసీమలోని కోకో సాగు చేస్తున్న రైతుల సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశంలో పలువురు రైతులు మాట్లాడుతూ కోకో సాగులో మెళకువలు, కాయ కోత, గింజల నాణ్యతగా తయారీ విధానాలు, మార్కెటింగ్ తదితర అంశాలపై అభిప్రాయాలను తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణ సమస్యల వల్ల కోకో గింజల దిగుబడి గణనీయంగా తగ్గిపోవడం వల్ల కోకో గింజల ధర ఇటీవల కాలంలో కిలో రూ.1000 వరకు పెరిగిందని అయితే ఈ ధర రూ.500కు తగ్గిపోవడం బాధాకరమన్నారు. పెరిగిన ధరలతో కోకో పంటను కాపాడుకోవాలనే ఆలోచనకు దారితీసిందని అందువల్ల పెరిగిన ధరలను కాపాడుకునేలా రైతులందరూ ఐకమత్యంగా కృషి చేయాలని సమావేశంలో రైతులు పేర్కొన్నారు. కోనసీమ కోకో రైతుల అసోసియేషన్ తరపున కోకో గింజలకు కనీస ధర ఉండేలా తీర్మానం చేశారు. సమావేశంలో రైతులు ముత్యాల జమ్మీలు, సర్పంచ్ దొంగ నాగేశ్వరావు, సమయమంతులు పండు, ఉప్పుగంటి భాస్కరరావు, చేకూరి సూర్యనారాయణ రాజు, ప్రసాద్ రాజు, అద్దాల గోపాలకృష్ణ, రెడ్డి రామకృష్ణ, కొప్పిశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.